ప్రారంభించిన రోడ్డును చూపుతున్న మంత్రి సవిత

# వైసిపి ఉనికి కోసమే జగన్ జిల్లా పర్యటన

## టిడిపితోనే గ్రామాల అభివృద్ధి : మంత్రి

**ప్రజాశక్తి-పరిగి**

వైసిపి ఉనికి కోసమే ఆ పార్టీ అధినేత జగన్ రాప్తాడుకు వస్తున్నారే కానీ ప్రజలకు మేలు చేకూర్చేందుకు కాదని మంత్రి సవిత ఘాటుగా విమర్శించారు. మంత్రి శనివారం మండలంలోని తిరుమలదేవరాయపల్లి, మూడిండ్లపల్లి, ఊటకూరు గ్రామాల్లో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో హత్యలు, అత్యాచారాలు ఎన్నో జరిగా యని, ఆ పార్టీ నాయకుల వల్ల పలువురు ఆత్మహత్య చేసుకున్నారని, కావున జగన్ ముందుగా ఆయా కుటుంబాలను పరామర్శించాలని హితవు పలికారు. దళితుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన అనంతబాబు, అక్కను వేధిస్తున్నారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తమ్ముడిపై పెట్రోల్ పోసి కాల్చి చంపిన సంఘటనల్లో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తన బాబాయ్ వివేకా హత్య కేసు, షర్మిల, సునీత చేస్తున్న ఆరోపణలపై నోరు విప్పాలన్నారు. అలాగే టిడిపి ఎమ్మెల్యే సునీత వైసిపి హయాంలో ఆ పార్టీ పాలకుల అరాచకాలను ఎండగట్టారని వాటికి జవాబు చెప్పాలని జగన్‌ను ప్రశ్నించారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల కోసమే పని చేశారన్నారు. అయితే జగన్ ప్రతిపక్షంలోకి వచ్చేసరికి రాజకీయ కక్షలు, ఫ్యాక్షన్‌ను రెచ్చగొట్టి తన ఉనికిని చాటుకోవాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. రాప్తాడు సంఘటనలో ఇప్పటికే నిందితులను పోలీసులకు అప్పజెప్పి శిక్షపడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరుమల దేవరాయపల్లిలో మరో రోడ్డు నిర్మాణానికి రూ. కోటి నిధులు కేటాయించారు. ఊటుకూరులో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిఆర్ ఏఈ నాగప్ప, తహశీల్దార్ హసీనా సుల్తానా, ఎంపిడిఓ శ్రీధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రత్యూష, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచి బాలాజీ, నాగరాజు, ఎర్రగుంట మూర్తి, లోకేష్, నాగభూషణ, మహేష్, శ్రీనివాసులు, హనుమయ్య, చౌడప్ప పాల్గొన్నారు.

# ప్రయివేటు ఘరూ..!



ప్రయివేటు విద్యా సంస్థల వేట మొదలైంది. ఈ ఏడాది ఇంకా విద్యా సంవత్సరం ముగియకనే కొత్త విద్యార్థుల కోసం అన్వేషణ మొదలు పెట్టారు. ఆయా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు యాజమాన్యం లక్ష్యాలను నిర్ధేశించింది. తప్పనిసరిగా ఇంత మంది విద్యార్థులను చేర్పించాలనే లక్ష్యం వారి ముందుంచింది. దీంతో కొత్తగా పాఠశాలల్లో చేరే పిల్లల్ని కనుగొనే పనిలో ఉపాధ్యాయులు, సిబ్బంది నిమగ్నం అయ్యారు.

- ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల అడ్మిషన్ల ఒత్తిడి
- ఉపాధ్యాయులు, సిబ్బందికి టార్గెట్
- అడ్మిషన్లను పెంచుకోవడమే లక్ష్యం
- ఇప్పుడు వేడుకోలు.. తర్వాత ఫీజు ఒత్తిళ్లు..




**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం అయిన తర్వాత అడ్మిషన్లను చేసుకోవడం పరిపాటి. ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు రావడంతో ముందస్తు అడ్మిషన్లు తెరపైకి వచ్చాయి. ఇవి ఎంతలా అంటే ఇంట్లో పాఠశాలలో చేర్పించే చిన్నారి ఉంటే బస్సులో సీటు కోసం కర్చీఫ్ వేసేలా ఆ పిల్లాడిపై కర్చీఫ్ వేస్తున్నారు. ప్రయివేటు యాజమాన్యల ఒత్తిడితో అందులో పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బంది కొత్త అడ్మిషన్ల కోసం ఎవరి పిల్లలున్నారన్న దానిపై ఆరాలు తీయడం మొదలు పెట్టారు. మరికొంత మంది మొబైల్‌ఫోన్ నంబర్లు తీసుకని తమ విద్యా సంస్థల్లో అడ్మిషన్లు ఆరంభమయ్యాయని, తక్షణం రిజర్వు చేసుకోవాలని ప్రాధేయపడుతున్నారు. ఒకసారి తమ విద్యా సంస్థను చూడాలంటూ తల్లిదండ్రులను కోరుతున్నారు. పదవ తరగతి పూర్తయిన వారికి ఇంటర్మీడియట్‌లో తమ కళాశాల చేర్చాలని తల్లిదండ్రులకు ఎడతెరిపి లేకుండా ఫోన్లు వస్తుండటం గమనార్హం. ఇంకా పరీక్షల ఫలితాలే రాలేదు.. అప్పుడే అడ్మిషన్లు ఏమిటంటూ తల్లిదండ్రులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**ఇప్పుడు చేర్చాలని ఒత్తిడి.. తరువాత ఫీజుల ఒత్తిడి**

విద్యా సంవత్సరం ప్రారంభంలో తమ విద్యా సంస్థల్లో చేర్చాలని బతిమాలి చేర్చుకోవడం జరుగుతుంది. ఇక తల్లిదండ్రులు ఈ విజ్ఞప్తులకు తలొగ్గి ప్రయివేటు విద్యా సంస్థల్లో చేరుస్తున్నారు. విద్యార్థిని పాఠశాలల్లో చేర్చేంత వరకు బాగానే ఉన్నా ఆతర్వాతనే అసలు కథ మొదలవుతుంది. ప్రయివేటు పాఠశాలల్లో పిల్లల్ని చేర్చిన తర్వాత తల్లిదండ్రులకు ఫీజుల మోత మొదలవుతుంది. ఈ ఫీజులు ఒత్తిడి ఎలా ఉంటుందంటే వీటిని తట్టుకోలేక విద్యార్థులు చనిపోయే పరిస్థితి కూడా ఉంటుంది. ఈ విద్యా సంవత్సరంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇద్దరు విద్యార్థులు ఫీజు ఒత్తిళ్లు తాళలేక మృతి చెందిన ఘటనలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే.

ఫీజుల ఒత్తిడిలో నారాయణ విద్యా సంస్థలో ఒక విద్యార్థి తరగతి గది నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. మరో కళాశాలలో బయటకెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంత జరుగుతున్నా విద్యా సంస్థల ధన దాహానికి కళ్లెం వేసే చర్యలను అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలుండటం లేదన్న విమర్శలున్నాయి. ఈ విద్యా సంవత్సరంలోనైనా ఇటువంటి ఫీజు ఒత్తిళ్లు లేకుండా తగిన చర్యలు తీసుకుంటారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

### అధికారులు చర్యలు తీసుకోవాలి

నిబంధనలను పాటించకుండా వ్యవహరిస్తున్న ప్రయివేటు విద్యా సంస్థలపై అధికారులు దృష్టి సారించాలి. ముందస్తు అడ్మిషన్లు తీసుకునే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలి. అటువంటి కళాశాలలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి. అలా తీసుకోకపోవడంతోనే గతేడాది ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు జిల్లాలో చూశాం. ఈసారైనా అధికార యంత్రాంగం అటువంటి ఘటనల నివారణకు చర్యలు తీసుకోవాలి.

**పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి**

# పిహెచ్‌సి తనిఖీ

**ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్**

ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా వైద్య సిబ్బంది పనిచేయాలని డిఎంహెచ్ఓ డాక్టర్ ఫిరోజ్ బేగం సూచించారు. పట్టణంలోని పిహెచ్‌సిని శనివారం డిఎంహెచ్ఓ సందర్శించి రికార్డులను పరిశీలిం చారు. అసంక్రమిత వ్యాధులపై చేపట్టిన సర్వే, మాతాశిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, అంటు వ్యాధులు, తదితర కార్యక్రమాలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఓపి సేవలు, ల్యాబ్, కాన్పులు, రోగులకు అందించే వైద్య సేవలపై ఆరా తీశారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ రోగుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సక్రమంగా వైద్య సేవలు అందించాలన్నారు. మనం అందించే సేవలను బట్టి రోగులు వైద్యశాలకు వస్తారన్నారు. ప్రతి ఒక్కరూ తన బాధ్యతను గుర్తెగి పని చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జ్యోత్స్న, మునిచంద్రిక, సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, సూపర్వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, స్టాఫ్ నర్సులు అరుణ, పద్మావతి, ఫార్మాసిస్ట్ నాగవేణి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య కార్యాకర్తలు, పాల్గొన్నారు.

# హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపండి

## ఎపి రైతు సంఘం, జలసాధన సమితి డిమాండ్

**ప్రజాశక్తి-హిందూపురం**

రైతులకు తీవ్ర నష్టాన్ని చేసే హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులను ఆపాలని ఏపీ రైతు సంఘం, జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, జలసాధన సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలకష్ణ వ్యక్తిగత కార్యదర్శి బాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ నిర్దేశించిన విధంగా ఉమ్మడి జిల్లాలో మూడు లక్షల 45 వేల ఎకరాలకు ఆయకట్టుకు నీరందించాలంటే ప్రధాన కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచాల్సి ఉందన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్‌ను 1500 క్యూసెక్కులకు వెడల్పు చేయాలని కోరారు. హిందూపురం ప్రాంత అభివద్ధికి విద్య, వైద్య, వ్యవసాయ నీటిపారుదల పరిశ్రమల రంగాలకు చెందిన జిల్లా కార్యాలయాలను హిందూపురంలో ఏర్పాటు చేయాలని కోరారు. హిందూపురంలో ప్రభుత్వ యూనివర్సిటీని ఏర్పాటు చేసి డిగ్రీ, పీజీ ఇంజనీరింగ్ కళాశాలలను ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ.హరి, కార్యదర్శి సిద్ధారెడ్డి, జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి చైతన్య గంగిరెడ్డి, ఓపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, భాస్కర్, ఆదినారాయణ, జలసాధన సమితి సభ్యులు అమానుల్లా, తిప్పేస్వామి, నవీన్, జమీల్, కార్మిక నాయకులు రవికుమార్, గోపాలకష్ణ పాల్గొన్నారు.

బాలయ్య పీఏ బాలాజీకి వినతిని ఇస్తున్న రైతుసంఘం, జలసాధన సమితి నాయకులు

# మార్గదర్శి డా॥బాబు జగ్జీవన్‌రామ్

◆ కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్న ◆ జిల్లా వ్యాప్తంగా ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

అణగారిన వర్గాల అభివృద్ధి, పాలనలో ప్రజా సంక్షేమం, స్వాతంత్ర్య ఉద్యమంలో అలుపెరగని పోరాటం సాగిన డా॥బాబు జగ్జీవన్ రామ్ అన్ని వర్గాల మార్గదర్శిగా నిలిచారని కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్న తెలిపారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమరయోధుడు డా॥బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను శనివారం నాడు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

శ్రీసత్యసాయి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డా॥బాబు జగ్జీవనరామ్ జయంతి వేడుకలను పుట్టపర్తి సాయి ఆరామంలో శనివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఎస్పీ వి.రత్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ యువకుడిగా స్వాతంత్ర్య పోరాటంలో అనేక పోరాటాలు సాగించారన్నారు. స్వాతంత్ర్యానంతరం సుదీర్ఘ కాలం కేంద్ర మంత్రివర్గంలో వివిధ శాఖల్లో పని చేశారన్నారు. కార్మిక, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక, ఆధునిక సంస్కరణలు తేవడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. సమాజం అభివద్ధి చెందాలంటే విద్య దిక్సూచిగా పనిచేస్తుంది చెప్పి చదువను ప్రోత్సహించిన మహనీయుడు అన్నారు. ఆయన స్ఫూర్తితో జిల్లాలో పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. గొప్ప సంఘసంస్కర్తలు, వారు చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పంచరత్నమ్మ, ఆర్డీవో సువర్ణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బి.గంగాధర్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, వివిధ కుల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

# సంక్షేమ వసతి గృహం సందర్శన

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

పుట్టపర్తి మండలం ఎనుములపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర సంక్షేమ వసతి గహాన్ని కలెక్టర్ టిఎస్.చేతన్ శనివారం సందర్శించారు. వసతి గృహంలో పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వంటశాల, భోజనశాలలో పరిశుభ్రతను పరిశీలించారు. కోడిగుడ్లు, బియ్యం, కూరగాయలు, సరుకుల నాణ్యతను పరిశీలించారు. భోజనం రుచిగా, నాణ్యతతో అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. వసతి గృహంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతగా చేయించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న మరమ్మతు పనులన్నీ రానున్న 5 రోజుల్లోపు పూర్తి చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి, శివరంగ ప్రసాద్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బాలాజీ, సంక్షేమ వసతి గహ అధికారి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాలకు 'కియా' సహకారం

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల అభివృద్ధికి సహకారం అందించాలని గతంలో ప్రిన్సిపల్ ప్రశాంతి కియా కార్ల కంపెనీ యాజమాన్యానికి విన్నవించారు. స్పందించిన కియా యాజమాన్యం కంపెనీ సిఎస్ఆర్ క్రింద కళాశాలకు రూ. 7 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో ఇప్పటికే భవనాలకు పెయింటింగ్ పనులను ప్రారంభించారు. తదుపరి గదుల్లో అవసరం మేరకు విద్యుత్ వైరింగ్, ఫ్యాన్లు, తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా కళాశాల అభివృద్ధికి ఆర్థిక సాయం చేశామని కియా కంపెనీ యాజమాన్యం తెలిపింది. ప్రిన్సిపల్ ప్రశాంతి మాట్లాడుతూ కియాతో పాటు మరొక కంపెనీకి కళాశాల పరిస్థితులను వివరించామన్నారు. కియా కంపెనీ అందజేసిన రూ. 7 లక్షలతో కళాశాల రూపురేఖలను మార్చడం సంతోషంగా ఉందని, కియా యాజమాన్యానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# సునీల్ రాజ్‌కు ఉగాది విశిష్ట పురస్కారం

**ప్రజాశక్తి-హిందూపురం**

గతంలో హిందూపురం మున్సిపాలిటీలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం మడకశిర నగర పంచాయతీకి బదిలీ అయిన సునీల్ రాజ్‌కు ఉగాది పురస్కారం దక్కింది. వంద ప్రపంచ రికార్డులను పొందిన సంస్థ ఆర్కే కళా సాంస్కతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు ఉమ్మడి రాష్ట్రాల్లో వివిధ రంగాలలో ప్రతిభను కనబరిచిన సాహితి ప్రియులు, సామాజిక సేవ, కళాకారులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్ త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో సునీల్ రాజ్‌కు ఉగాది పరస్కారం అందించి సత్కరించారు. సునీల్ రాజ్ వద్ధాశ్రమాలకు నిస్వార్థంగా చేసిన సేవలను గుర్తించి ఈ సత్కారం చేశారు. సునీల్ రాజ్ ఉగాది పురస్కారాన్ని అందుకోవడంపై హిందూపురం మున్సిపల్, మడకశిర నగర పంచాయతీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయన్ను అభినందించారు.

సునీల్ రాజును సన్మానిస్తున్న నిర్వాహకులు

# బిగించారు సరే.. వెలిగించేది ఎప్పుడు...?

**ప్రజాశక్తి-హిందూపురం**

పట్టణంలోని రహమత్ పురం సర్కిల్ నుంచి ఆటోనగర్ భగీరథ సర్కిల్‌లో రహదారి డివైడర్లను ఏర్పాటు చేశారు. ఇందులో గత నెల 31వ తేదీన రంజాన్‌ను పురస్కరించుకుని రూ.40లక్షలు వెచ్చించి రహమత్ పురం సర్కిల్ నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు ఎల్ఈడి బల్బుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందు కోసం 31 విద్యుత్ స్తంభాలకు 62 ఎల్ఈడి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో తమకు ఎల్ఈడీ వెలుగులు వస్తాయని ఆ ప్రాంతవాసులు భావించారు. వీటిని ఏర్పాటు చేసి ఆరు రోజులు గడిచినప్పటికీ మున్సిపల్ అధికారులు బిగించిన ఎల్ఈడీలు ఇంత వరకు వెలగలేదు. ఈనెల 20వ తేదీపైన స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పర్యటన ఉంటుందని, ఆయన చేతుల మీదుగా వాటిని ప్రారంభించడానికి మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఏర్పాటు చేసిన బల్బులను వెలిగించేందుకు అధికారులు చేస్తున్న జాప్యంపై స్థానికులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ బల్బులు

విద్యుత్ దీపాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విద్యుత్ మీటర్

# ధర్మవరం మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్‌గా అయ్యప్ప

## డైరెక్టర్‌గా కమతం వాణి



అయ్యప్ప

కమతం వాణి

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

ధర్మవరం మార్కెట్ యార్డ్ కమిటీలో మండలానికి ప్రాధాన్యత దక్కింది. యార్డ్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ స్థానాలతో పాటు 13 మంది డైరెక్టర్లను శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే. కూటమి పొత్తులో భాగంగా ఛైర్మన్ పదవి బిజెపికి దక్కగా, వైస్ ఛైర్మన్‌గా సంజీవపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ముల్లగూరు అయ్యప్ప, డైరెక్టర్‌గా పోట్లమర్రి గ్రామానికి చెందిన కమతం వాణిని ఎంపిక చేశారు. వాణి తెలుగుయువత అధ్యక్షులు కమతం మోహన్ భార్య. వీరి ఎంపిక పట్ల మండల టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ ఎంపికకు సహకరించిన నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీరామనవమి ఏర్పాట్లు పరిశీలన

ఏర్పాట్లను పరిశీలన చేస్తున్న మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్ తదితరులు

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పట్టణం సూగూరు ఆంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవ ఏర్పాట్లను మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు కొల్లకుంట అంజనప్పలు శనివారం పరిశీలించారు. దేవాలయంలో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం, రథోత్సవం, సాయంత్రం ఉట్ల పరుష, రాత్రి లంక దహనం కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు సహకారం అందిస్తామని మున్సిపల్ ఛైర్మన్ తెలిపారు. ఇప్పటికే ఆలయం వద్ద పారిశుధ్య పనులను చేయించామన్నారు. నీటి ట్యాంకర్లతో మైదానం అంతా శుద్ధి చేసి, కుస్తీ పోటీలకు అనుకూలంగా తయారు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్ కుమార్, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు అమర్ నాథ్, టీడీపీ నాయకులు భాస్కర్, ప్రెస్ వెంకటేష్, దుర్గా నవీన్, హనుమంతు, మురళీ దేశాయ్, అంజాద్, అన్వర్, నూరుల్లా, రవీంద్ర, బుస ప్రసాద్, కిరికెర మాజీ సర్పంచా రాము, ఎంహెచ్ఓ శోభన్ రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు శంకర్, నిజాం పాల్గొన్నారు.

# వైసిపి బలోపేతమే అందరి లక్ష్యం : దుద్దుకుంట

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

వైసిపి బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మున్సిపాలిటీకి చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అధికార పార్టీ నాయకులకు ఎవరూ భయపడాల్సిన పని లేదని, అండగా ఉంటామన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, వైస్ ఛైర్మన్లు తిప్పన్న, లక్ష్మీనారాయణరెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి ఫొటో సాయి పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు చర్యలు : డీఎస్పీ

**హిందూపురం :** బాలికలు, మహిళల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని హిందూపురం డీఎస్పీ మహేష్ తెలిపారు. పల్లె నిద్రలో భాగంగా శుక్రవారం రాత్రి లేపాక్షి మండలం పులిమతి పంచాయతీ సడ్లపల్లి గ్రామంలో పోలీసులు పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలకు డీఎస్పీ పలు సూచనలు చేశారు. ప్రతి మహిళా చదువుకోవాలన్నారు. మహిళలకు సంబంధించి ఏదైనా ప్రమాదం జరగబోతోందన్న సంకేతం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డయల్-100, శక్తి యాప్ ద్వారా వారి సమస్యను తెలియజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ జనార్ధన్, లేపాక్షి ఎస్ఐ నరేంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బడుగుల ఆశాజ్యోతి బాబుజగ్జీవన్‌రామ్

## జయంతి సభల్లో అధికారులు, ప్రజాసంఘాల నాయకులు

కదిరిలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

మహాత్మగాంధీ స్ఫూర్తితో జాతీయోద్యమంలో పాల్గొని దేశ రాజకీయాల్లో సరికొత్త నినాదంగా మారిన వ్యక్తి భారతరత్న డా. బాబు జగ్జీవన్‌రామ్ అని యుటియుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రా రెడ్డి పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకూ రాజకీయ ప్రాతినిధ్యం దక్కాలని జగ్జీవన్‌రామ్ ఉద్యమించారన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించారన్నారు. పేదలకు సామాజిక న్యాయం చేరువ చేయడంలో ఆయన కృషి మరువరానిదన్నారు. దేశ కార్మిక, రైల్వే, రక్షణ శాఖల మంత్రిగా చూపిన దీక్షా దక్షతలు నేటికీ ఆదర్శనీయమన్నారు. వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవానికి నాంది పలికారన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, రామ్‌ప్రసాద్, రామాంజనేయులు, ఆదిశేషు, మోహినుద్దీన్, బాలరాజు, పాల్గొన్నారు.

**సిఐటియు ఆధ్వర్యంలో..**

పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మున్సిపల్ కార్మికులు శ్రీరాములు, ఎం.బాబు, సిఐటియు నాయకులు జెవి.రమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు ముకుంద ప్రసాద్ చెన్నకేశవులు లక్ష్మీ ఓబులేసు పెద్దక్క పుల్లన్న, కార్మికులు పాల్గొన్నారు.




ధర్మవరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పిస్తున్న సిఐటియు నాయకులు

**వైసిపి ఆధ్వర్యంలో..**

పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైసిపి ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవరకొండ రమేష్, ఎం.చౌడప్ప, గోపాల్, గుజ్జల బొమ్మన్న, సాకే వెంకటేష్, కృష్ణమూర్తి, మల్లెల పెద్దన్న, కుళ్లాయప్ప, సుబ్రమణ్యం, మల్లికార్జున, సాకే లక్ష్మీనారాయణ, నారాయణస్వామిలు పాల్గొన్నారు.

**గొప్ప సంఘసంస్కర్త జగ్జీవన్‌రామ్ : మంత్రి సవిత**

**పెనుకొండ :** గొప్ప సంఘసంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ అని మంత్రి సవిత కొనియాడారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంత్రి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుడు, పాలనాదక్షుడు, దేశానికి విశేష సేవలు అందించిన మహనీయులు జగ్జీవన్‌రామ్ అన్నారు.

**సిపిఎం కార్యాలయంలో..**

పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాబావలి, గంగాధర్, ఆరిఫ్, కిష్టప్ప, హబీబ్ పాల్గొన్నారు.

**అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి : ఎమ్మెల్యే**

**కదిరి టౌన్ :** బాబు జగజ్జీవన్ రామ్ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కొనియాడారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కందికుంట మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో..**

ఆదర్శప్రాయుడు బాబు జగ్జీవన్ రామ్ అని పట్టణ కాంగ్రెస్ నాయకులు చిలమత్తూరు మోహన్ గాంధీ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు అష్రఫ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఇస్మాయిల్, ఇర్షాన్, బాబా, భార్గవ్, షాహిద్ పాల్గొన్నారు.

**హిందూపురం :** బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు వడ్డె అంజినప్ప, ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ బాలాజి, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**వైసిపి కార్యాలయంలో..**

డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి ఆ పార్టీ నాయకులు వేణు రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు మహేష్ గౌడ్, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్ రెవెన్యూ అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు.

# నేరాలు ఘోరాలు

## మానసిక రోగి ఆత్మహత్య

**ప్రజాశక్తి-పావగడ**

తాలూకాలోని కనివేనహళ్లి గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం మానసిక వ్యాధితో బాధ పడుతున్న ఓ వ్యక్తి గొంతు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. కనివేనహళ్లి గ్రామానికి చెందిన హనుమంత రాయ(30) మానసిక వ్యాధితో బాధపడుతూ పలుమార్లు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. శుక్రవారం సాయంత్రం గ్రామ శివారులోని మొక్కజొన్న పొలానికి వెళ్లి వెంట తీసుకెళ్లిన కత్తితో గొంతు కోసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు గమనించి అతడిని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తుమకూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. హనుమంతరాయుడు భార్య ఈరమ్మ, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సురేష్ తెలిపారు.

## అపార్ట్‌మెంట్ పైనుంచి పడి వృద్ధురాలు మృతి

**ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్**

పట్టణంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో శనివారం 7వ అంతస్తు పైనుంచి కిందపడి వృద్ధురాలు మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని చిత్రావతి నది రహదారిలో ఉన్న రంగసాయి అపార్ట్‌మెంట్‌లో 1వ అంతస్తులో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సుబ్బరాజు భార్య హేమలత(80) కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. తెల్లవారుజామున లిఫ్ట్‌లో 7వ అంతస్తుకు వెళ్లిన ఆమె అక్కడి నుంచి కిందపడి మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

## కారు బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

**ప్రజాశక్తి-నంబులపూలకుంట**

నంబులపూలకుంట సమీపంలో ఉన్న పెడపల్లి వెళ్లే రోడ్డులో హంద్రీ నీవా కాలువ వద్ద శనివారం కారు అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

అదుపుతప్పి బోల్తాపడిన కారు

రెడ్డివారిపల్లి గ్రామస్తులు తెలిపిన వివరాలు.. నంబులపూలకుంట నుంచి పెడపల్లి వెళ్లే రోడ్డులో హంద్రీనీవా కాలువ వద్ద ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కారు డ్రైవర్ సంతోష్‌కు తీవ్రంగా గాయపడగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమీపంలోని ఇటుక బట్టీలో పని చేస్తున్న కూలీలు గమనించి వారికి 108 ద్వారా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## వరకట్న వేధింపులపై కేసు

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

కోడలిపై వరకట్న వేధింపులకు పాల్పడుతున్న అత్తింటి వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని వలిసాబ్ రోడ్డులో నివాసం ఉండే షేక్ నాజియకు తనకల్లు మండలంలోని కొర్తికోట గ్రామానికి చెందిన షేక్ బావాజీతో పెద్దలు వివాహం జరిపించారు. వివాహ సమయంలో నాజియ తల్లిదండ్రులు షేక్‌బావాజీకి కట్నం కింద 15 తులాల బంగారు నగలు, రూ. 10 లక్షల నగదు ఇచ్చారు. వారికి ఓ కొడుకు ఉన్నాడు. బావాజీ నాలుగేళ్ల నుంచి చెడు వ్యసనాలకు అలవాటుపడి నాజియను శారీరకంగా, మానసికంగా వేధించడంతో పాటు అదనపు కట్నం తేవాలని ఒత్తిడి చేసేవారు. భర్తతో పాటు ఆమె అత్త మహబూబ్ బీ, ఆడపడచులు హసీన, రేష్మ కూడా నాజియను వరకట్నం పేరుతో వేధించేవారు. షేక్ నాజియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

## పేకాట జూదరులు అరెస్ట్

**ప్రజాశక్తి-చిలమత్తూరు**

మండలంలోని సంజీవరాయునిపల్లి వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడులు చేసి జూదరులను అరెస్టు చేసి, నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. సంజీవరాయునిపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసి ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 10,350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మరో 8 మంది పరారైనట్లు ఆయన తెలిపారు.

## నాటుసారా తయారీదారులు..

**ప్రజాశక్తి-బుక్కపట్నం**

మండలంలో ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్ఐ ఉమామనోహర్‌రాజు హెచ్చరించారు. మండలంలోని నార్సింపల్లితండాలో శనివారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేసి 225 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేస్తున్న మురళినాయక్, భాస్కర్‌నాయక్, సావిత్రిబాయిలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు నమోదు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు ఓంసింహ, నాగరాజు, హరికృష్ణ, అలీ, ఎస్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# శ్రీసత్యసాయి కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్ డే

**ప్రజాశక్తి-పెనుకొండ టౌన్**

విద్యార్థి దశ నుంచే మంచి క్రమశిక్షణ, అంకితభావంతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోగలరని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో ఫేర్‌వెల్ డే అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఎస్పీ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఆంగ్ల ఉపాధ్యాయుడు సమీవుల్లా హాజరయ్యారు. జూనియర్లు సీనియర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. డీఎస్పీ మాట్లాడుతూ దేశానికి సేవ చేయడానికి ఎన్నో మార్గాలున్నాయని, యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమీవుల్లా మాట్లాడుతూ మంచి విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్యను అభ్యసిస్తే ఆదర్శవంతమైన పౌరులుగా గుర్తింపు పొందుతారన్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఏవో కేశవయ్య, గంగాధర్, అధ్యాపకులు వినోద్, హుమయూన్, నవీన్, అనిల్, నవీన్, శశిధర్, రమ్యకళ, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

వేసవి దృష్ట్యా ప్రయాణికులు, ప్రజల దాహార్తి తీర్చడానికి దాతలు ముందుకు రావాలని ఎస్ఐ సోమశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో దాతల సహకారంతో పోలీసులు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారం ఎస్ఐ ప్రారంభించి మాట్లాడారు. వివిధ పనులపై బత్తలపల్లికి వచ్చే ప్రజలు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు మినరల్ వాటర్ ప్లాంట్ల యజమానులతో చర్చించి ఉచితంగా మినరల్ వాటర్ అందిస్తున్నట్లు తెలిపారు. చలివేంద్రం ఏర్పాటుకు సహకరించిన మినరల్ వాటర్ ప్లాంట్ల యజమానులు పల్లపోతుల శ్రీరాములు, ఖలందర్‌బాషా, కృష్ణయ్య, అంజి, కోటి నరేష్, గుజరి వెంకటేష్, తదితరులను అభినందించారు. కార్యక్రమంలో ఎఎస్ఐలు సోమశేఖర్‌మూర్తి, తిరుపాలు, హెడ్ కానిస్టేబుల్స్, పోలీస్ సిబ్బంది, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, దండోరా ధర్మవరం డివిజన్ నాయకులు సాకే లక్ష్మన్న, బిజెపి నాయకులు కుమ్మర వెంకటరమణ పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ సోమశేఖర్

రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ నారాయణస్వామి

## గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల అడ్డగింతపై విచారణ

**ముదిగుబ్బ :** మండలంలోని కొండగట్టుపల్లి సమీపంలో జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను రైతులు రమణయ్య, శ్రీనివాసులు అడ్డుకున్నారు. దీనిపై శుక్రవారం తహశీల్దార్ నారాయణస్వామి విచారణ చేపట్టి పనులను కొనసాగింపజేశారు. రైతుల భూమికి పరిహారం అందినా అందులోని బోరుకు అందలేదని పనులను నిలిపివేశారు. పరిహారం అందేలా నివేదిక పంపానని తహశీల్దార్ చెప్పడంతో పనులను కొనసాగింపజేశారు.

## నేడు సీతారాముల కళ్యాణోత్సవం

**బుక్కపట్నం :** శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని స్థానిక వాల్మీకి రామాలయంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటలకు సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు ఉంటాయన్నారు. అనంతరం శ్రీసీతారాములకు ఎదుర్కోళ్ల ఉత్సవం, ఆ తర్వాత కల్యాణోత్సవం కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పాల్గొని శ్రీసీతారాముల ఆశీస్సులు పొందాలని తెలిపారు.

## టిడిపి సభ్యత్వం కార్డుల అందజేత

**ధర్మవరం రూరల్ :** 'టిడిపి సభ్యత్వం.. కార్యకర్తల జీవితానికి భద్రత' అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. పట్టణం లోని 34వ వార్డ్ రాజేంద్రనగర్‌లో శనివారం రాష్ట్ర కార్యాలయం పంపిన పార్టీ సభ్యత్వం కార్డులను కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో నాగూర్ ఉమర్(స్టాలిన్), జగదీష్, గంగాధర్, మోహన్, షామీర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## తుప్పు పట్టిన విద్యుత్ స్తంభం

**రొద్దం :** స్థానిక పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో బేకరీ దుకాణానికి అనుకొని ఉన్న ఓ ఇనుప విద్యుత్ స్తంభం కింది భాగంలో తుప్పు పట్టి ఎప్పుడు కూలుతుందో అనే స్థితికి చేరింది. ప్రధాన రహదారిలో ఉన్నందున ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరగకనే విద్యుత్ శాఖ అధికారులు స్తంభాన్ని మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తుప్పు పట్టిన విద్యుత్ స్తంభం

# ఎన్‌ఆర్‌ఐ సహకారంతో రామాలయ నిర్మాణం

**ప్రజాశక్తి-గోరంట్ల**

ఎన్‌ఆర్‌ఐ శేషాద్రిరెడ్డి

మండలంలోని నర్సంపల్లి పంచాయతీకి చెందిన బూడిదిగడ్డిపల్లి గ్రామంలో సుమారు రూ. 1.5 కోట్ల వ్యయంతో శ్రీపట్టాభి రామచంద్రస్వామి ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. ఈ నెల 8వ తేదీ విగ్రహం, గోపురం, కలశ ప్రతిష్టాపన, శ్రీసీతారామచంద్రస్వాముల కళ్యాణోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయ నిర్మాణానికి ఇదే గ్రామానికి చెందిన జయచంద్రరెడ్డి కుమారుడు యుఎస్ ఎలో స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐ శేషాద్రిరెడ్డి సహకారం అందించారు. ఆలయ నిర్మాణానికి ఏడాది క్రితం భూమిపూజ చేశారు. నిర్మాణం పూర్తవడంతో శనివారం శేషాద్రిరెడ్డి మాట్లాడుతూ పుట్టిన గ్రామంలో ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందించామన్నారు. తమిళనాడుకు చెందిన శిల్పులు ఆలయ నిర్మాణం చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని నతీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. ఆ రోజు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

## కంటి వైద్యశిబిరానికి స్పందన

**ప్రజాశక్తి-హిందూపురం**

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని రోటరీ హాలులో కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 25 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం ఎంపికి చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు రెడ్డి, శ్రీనివాసులు, ప్రతినిధులు ఓబుళ కొండయ్య, గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, వైద్యులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

**ప్రజాశక్తి-నల్లచెరువు**

నల్లచెరువులోని ఆంజనేయస్వామి మండల సమైక్యలో శనివారం ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదర్శ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక అభివృద్ధిపై అవగాహన ఉండాలన్నారు. రీసోర్స్ పర్సన్లు బత్తల గంగరాజు, శివశంకర్ మాట్లాడుతూ బ్యాంకు అందిస్తున్న వివిధ ఖాతాలు, వాటి లాభాలను వివరించారు. శివానంద మాట్లాడుతూ మహిళలకు పొదుపు గురించి అవగాహన ఉండాలన్నారు. చేసే పనిని బట్టి పొదుపు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు గంగాదేవి, వెలుగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో పాల్గొన్న మహిళలు

## 11న పుట్టపర్తిలో బిసిల సమరభేరి

**ప్రజాశక్తి-హిందూపురం**

మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఈ నెల 11న పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్ ముందు బిఎస్‌పి ఆధ్వర్యంలో బిసిల సమరభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి శ్రీరాములు తెలిపారు. శనివారం పట్టణంలోని బిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని, బీసీల కులగణన నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 11న శ్రీ సత్యసాయి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బిసిలు అందరూ ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు, రిటైర్డ్ ఎంఇఒ పెన్నయ్య, దాసరి ఈశ్వరయ్య, సుబ్బరాయప్ప, కొండప్ప, కొట్నూరు గంగప్ప, సుబ్బన్న, నరసింహప్ప, స్టూడియో గంగాధర్, తిరుమలేష్ పాల్గొన్నారు.

# ప్రకాష్‌రెడ్డి.. రాప్తాడులో కక్షలు రేపొద్దు : టిడిపి

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

ప్రశాంతంగా ఉన్న రాప్తాడు నియోజకవర్గంలో కక్షలు రేపొద్దని నియోజకవర్గ టిడిపి నాయ కులు వైసిపి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి హితవు పలికారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, కుటుంబ సభ్యులు నిరంతరం ప్రజల్లో ఉంటూ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ, అభివృద్ధి చేస్తుండగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఫ్యాక్షన్‌ని రెచ్చగొట్టేలా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. నువ్వు ఇంకా అధికారంలో ఉన్నావన్న భ్రమలతో ఇష్ట మొచ్చినట్టు మాట్లాడుతున్నా పరిటాల శ్రీరామ్ సూచనలతో తాము ప్రశాంతంగా ముందుకెళుతున్నామన్నారు. ఇక నుంచైనా పద్ధతి, మాట తీరు మార్చుకోకపోతే.. మేమేంటో కూడా చూపించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అంబటి సనత్, బాబూఖాన్, రాళ్లపల్లి షరీఫ్, తలారి చంద్రమోహన్, డిష్ లచ్చి పాల్గొన్నారు.

**పరిటాల కుటుంబాన్ని విమర్శించే అర్హత లేదు**

**బత్తలపల్లి :** ప్రజల అభిమానం చూరగొన్న పరిటాల కుటుంబాన్ని విమర్శించే అర్హత తోపుదుర్తి కుటుంబానికి లేదని మండల టిడిపి నేతలు పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నాయకులు చిట్రా నాగభూషణ, తరిగోపుల చౌదరి, ఉమ్మాల చంద్రశేఖర్, కమతం మోహన్, అప్పరాచెరువు సూరి, బీదాల నారాయణస్వామి, సాకే రామకృష్ణ, కప్పల అక్కులప్ప తదితరులు మాట్లాడారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌పై మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. పరిటాల రవీంద్ర కుటుంబంపై దుర్భాషలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం వైసిపి దిగజారుడుకు నిదర్శనమన్నారు. ఇకనైనా తోపుదుర్తి వర్గీయులు పరిటాల కుటుంబాన్ని విమర్శించడం మానకపోతే భవిష్యత్తులో ఆ నియోజకవర్గ ప్రజలే తోపుదుర్తి కుటుంబానికి రాజకీయ సమాధి కడతారని హెచ్చరించారు.

# 'వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం అప్రజాస్వామికం'

**ప్రజాశక్తి-పెనుకొండ**

పార్లమెంటులో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందడం ప్రజాస్వామికమని ఆవాజ్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఆవాజ్ కమిటీ అధ్యక్షులు మహబూబ్‌బాషా శనివారం పట్టణంలో విలేకరుల తో మాట్లాడారు. ప్రతిపక్షాల తీవ్ర ప్రతిఘటన నడుమ వక్ఫ్ చట్టానికి సమూల సవరణలు చేయడం, బిల్లు పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందడం శోచనీయమన్నారు. ఈ బిల్లు రాజ్యాంగాన్ని, ముస్లిం మైనార్టీల హక్కులను, మత స్వేచ్ఛను హరిస్తుందన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య వాదులు, ముస్లిం సమాజం వెలిబుచ్చిన అభ్యంతరాలను బిజెపి ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. వక్ఫ్ ఆస్తులను స్వాధీన పరుచుకునే కుట్రలెన్నో ఈ బిల్లులో ఉన్నాయన్నారు. మోడీ ప్రభుత్వం ఈ బిల్లును ఉపసంహరించుకునేంత వరకూ ఆవాజ్ కమిటీ వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు బాబావలి, ఆరిఫ్, హబీబ్ పాల్గొన్నారు.

## ఖాద్రీశుని సన్నిధిలో భక్తుల రద్దీ

**కదిరి అర్బన్ :** పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ నృసింహుని ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీస్వామి వారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయ ఆవరణలో బారులు తీరారు. జిల్లా నుంచే కాకుండా కర్నాటక, తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చా రు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం, తిరుమాడ వీధులు మార్మోగాయి. భక్తులు ముందుగా స్వామి వారికి తలనీలాలు, తులభారం, తదితర రూపంలో మొక్కుబడి సమర్పించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం అతి శీఘ్రదర్శనం, ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

నరసింహస్వామి సన్నిధిలో భక్తజనం

## తెలంగాణ భక్తుల పర్తియాత్ర

**ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్**

తెలంగాణ యువజన సంఘం సత్యసాయి భక్తులు శనివారం నుంచి పుట్టపర్తికి పర్తియాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని సత్యమ్మ సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక రథాన్ని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు ఆర్‌జె.రత్నాకర్ దంపతులు ప్రారంభించారు. భక్తులు మాట్లాడుతూ ఏటా తెలంగాణ నుంచి పుట్టపర్తికి పర్తియాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా 5,500 మంది భక్తులతో పర్తియాత్ర చేపడతామన్నారు.

## వృద్ధులకు అన్నదానం

**ప్రజాశక్తి-చిలమత్తూరు**

దళిత గిరిజన ప్రజా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రాకెట్ల చందునాయక్ ఆదేశాల మేరకు శనివారం రాష్ట్ర అధ్యక్షులు చాకలి గంగరాజు, జిల్లా డిజిపి సంఘం యూత్ ఆధ్వర్యంలో వృద్ధులకు భోజనం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిజిపి జిల్లా సంఘం యూత్ హరీష్, ఎం.గిరీష్, సూరి, నాగరాజు, హేమంత్‌కుమార్, పాల్గొన్నారు.

# హాట్ అండ్ కూల్..!

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

అటు చల్లదనం, ఇటు వేడి రెండు కలగలసి ఈ వారంలో వాతవరణాన్ని హాట్ అండ్‌గా కూల్‌గా మార్చేసింది. వారం ప్రారంభం వరకు మండుటెండలతో జనం అల్లాడారు. వారం మధ్యలో నుంచి ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. గాలులతోపాటు, ఒక మోస్తరు వర్షపాతం పడటంతో వేడి తాపం నుంచి కొంత ఉపశమనం లబించింది. చాలా చోట్ల ఈ అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా మొక్కజొన్న పంట దెబ్బతింది. ఉగాది పండుగ పూర్తయిన తరువాత వచ్చిన ఈ వర్షాలతో రైతుల్లోనూ ఉత్సహం నెలకొంది. సాధారణంగానే పండుగ సమయంలో వర్షాలు పడుతుంటాయి. వీటిని ముంగారు వర్షాలని రైతులు పిలుస్తారు. ఈ వర్షాలు అనంతరం దుక్కులు దున్నుకునే పనులను రైతులు చేస్తారు. దీని ద్వారా గతేడాది వేసిన పంట మొత్తగా మారి భూమి గుల్లాబారు చేయడం తరువాత సీజన్‌లో వచ్చే వర్షాలకు నీళ్లు బాగా భూమిలో ఇంకేందుకు వీలుంటుంది. అందుకు ఈ వర్షాలు ఉపయోగపడతాయని రైతులు భావిస్తుం టారు. ఈ వర్షాలతో రైతుల్లో ఒకింత ఆనందం నెలకుందనే చెప్పవచ్చు.

ఈ వారంలో రాజకీయంగానూ చాలా హాట్‌గానే పరిణామాలు జరిగాయి. ఎంపిపి ఎన్నికలకు సంబంధించి రామగిరి, గాండ్లపెంట మండలాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పెద్దఎత్తున ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించింది. ఇదే సమయంలో రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో కురుబ లింగమయ్య హత్యకు గురయ్యారు. వైసిపి నాయకులు దీనిని ఫ్యాక్షన్ హత్యగా భావిస్తున్నారు. ఇది రాజకీయంగా టిడిపి, వైసిపిల మధ్య వేడిని రాజేశాయి. ఈ హత్యానంతరం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం సాగుతోంది. టిడిపి హయాంలో జరిగిన హత్యల గురించి వైసిపి ఆరోపిస్తుండగా, వైసిపి హయాంలో జరిగిన హత్యల గురించి టిడిపి నేతలు ఆరోపిస్తున్నారు. ఇలా రెండు పార్టీల నేతల మధ్య ఇద్దరి మధ్య మాటలు తారా స్థాయికే చేరాయి. హత్యకు గురైన లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు 8వ తేదీన వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాపిరెడ్డిపల్లి రానుండటం మరింతగా చర్చకు దారితీస్తోంది. వైసిపి ఈ ఘటనను తీవ్రంగా తీసుకున్నట్టు కనిపిస్తోంది.

భూ సమస్యలపై ఈ వారంలో పెద్దఎత్తున చర్చ నడిచింది. భూ ఆక్రమణలపై ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై అంతకు మునుపు నుంచే ఆరోపణలున్నాయి. చెరువు పక్కనున్న గుట్టను కబ్జా చేసారని ప్రతిపక్షంలో ఉండగా టిడిపి ఆరోపించింది. ఇప్పుడు ఈ భూములపై చర్యలకు ఉపక్రమించింది. అయితే కేతిరెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో తాత్కాలికంగా అది ఆగింది. ఇక బిజెపి నాయకుడు ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ యాదవ్ అసైన్డ్ భూములను అక్రమ మార్గంలో సొంతం చేసుకున్నారన్న ఆరోపణలు పెద్దఎత్తున వెల్లువెత్తుతున్నాయి. దీనిపై చర్యలకు అధికారులు సిద్ధపడటం కనిపిస్తోంది. ఇటుకలపల్లి పరిధిలో భూములు అదే రకంగా కొనుగోలు చేసారని అధికారులు నోటీసులిచ్చారు. అంతకు మునుపు అడవి బ్రాహ్మణపల్లిలో గిరిజనల భూములు కొనుగోలు చేసారని ఆరోపణలున్నాయి. అంతకంటే ముందు కియా పరిశ్రమ వద్ద కొనుగోలు చేసిన భూముల వ్యవహారంలో వివాదాలు నడిచాయి. ఇలా అనేక చోట్ల వివాదాలు రావడం, వాటిపై చర్యలకు అధికారులు ఉపక్రమించడం జరుగు తోంది. వీటిని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి చేయిస్తున్నారని ఆయన ఆరోపిస్తుండటం గమనార్హం. ఇలా భూ వివాదాలు కూడా ఈ వారంలో ప్రధాన అంశాలుగా ముందుకొచ్చాయి.

## పాముకాటుతో రైతు మృతి

**ప్రజాశక్తి-రొద్దం**

సిద్ధప్ప(ఫైల్‌ఫొటో)

మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన రైతు ఎ.సిద్ధప్ప(49) శనివారం పాముకాటుకు గురై మృతి చెందాడు. సిద్ధప్ప ఉదయం 10 గంటల సమయంలో గ్రామ సమీపంలో ఉన్న మల్బరీ తోటకు వెళ్లి ఎద్దులు మడకతో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో ఆయన గట్టిగా అరుస్తూ స్పృహ తప్పి పడిపోయాడు. చుట్టుపక్కల పొలాల్లోని రైతులు అక్కడి చేరుకుని 108కు సమాచారం ఇచ్చారు. అది వచ్చేందుకు ఆలస్యం కావడంతో ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండగా మార్గమధ్యలో 108 ఎదురు రావడంతో ఆపి సిబ్బంది పరిశీలించి రైతు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందించారు. రైతు మృతితో ఆ కుటుంబంలో రోదనలు మిన్నంటాయి.

**IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE: ANANTHAPURAMU.**
**E.P. No: 1008/2024 in .Arb.ptn. as Arb. O.P. No: 501/2024**

**Between:**
Manappuram Finance Ltd., Anantapuramu.Rep by its Asst. Manager
**...Decree Holder**
**And**
Chenna Sreenivasulu & Another
**...Judgment Debtors**

**Jdr 1&2 Order 21 Rule 37 CPC Notice**
**To,**
**J.Dr No:1**:Chenna Sreenivasulu, S/o. Late C.V.Venkatesulu, Residing at H.No.23-586, Sai Nagar, Near Kethireddy House, Dharmavaram.
**J.Dr No:2**:C.Sreelakshmi W/o Chenna Sreenivasulu, Residing at H.No.23-586, Sai Nagar, Near Kethireddy House, Dharmavaram. Sri Satyasai District.

పై పిటీషను బాకీ మొత్తమును రాబట్టుకొనుటక గాను దాఖలు చేసిన E.P. లో 1 మరియు 2వ J.drs అయిన మీరు 11-04-2025వ తేదిన హాజరగుటకు గాను వాయిదా ఉన్నది. పై దినం ఉదయం 10:30 గం॥లకు పై కోర్టువారి ఎదుట ఖుద్దున గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
**మాలెపాటి వేణుగోపాల్, అడ్వకేట్,**
**అనంతపురం. సెల్ నెం:9440196006.**